



సదస్సులో పాల్గొన్న భారీ పరిశ్రమలశాఖ మంత్రి జగదీశ్‌శెట్టర్ తదితరులు .. ఓ ప్రదర్శన వీక్షిస్తున్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో శెట్టర్

# యువతకు నవీన శిక్షణ

**శివాజీనగర, ఎలక్ట్రానిక్‌సిటీ, న్యూస్‌టుడే :** రాష్ట్రంలో రెండు కోట్ల మంది యువతకు కౌశల్య శిక్షణనివ్వాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు భారీ పరిశ్రమలశాఖ మంత్రి జగదీశ్‌శెట్టర్ ప్రకటించారు. ఆయన మంగళవారం ప్యాలెస్ మైదానంలో 'మూడు రోజుల గ్లోబల్ ఎగ్జిబిషన్ ఆన్ సర్వీసెస్ సదస్సు'ను ప్రారంభించారు. ఏరోస్పేస్, వ్యవసాయం, జీవ వైవిధ్యం, మౌలిక సదుపాయాలు, సమాచార సాంకేతిక, అంకుర రంగాలకు సంబంధించి విధానాల్ని రూపొందించడం ద్వారా కర్ణాటక అగ్రస్థానంలో ఉందన్నారు. అనేక వైద్య విద్యాలయాలకు నిలయంగా ఉన్న కర్ణాటక వైద్య విద్యా రంగంలో ఉన్నత స్థానాన్ని ఆక్రమించినట్లు తెలిపారు. బెంగళూరు నగరం వైద్య పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్నట్లు చెప్పారు.



అత్యాధునిక డ్రోన్‌ను వీక్షిస్తున్న మంత్రులు పీయూష్, శెట్టర్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కర్ణాటక పథకాలు అనూహ్యంగా విజయం సాధించాయని చెప్పారు. వివిధ దేశాలకు చెందిన అధికశాతం మంది విద్యార్థులు కర్ణాటకను ఎంపిక చేసుకుంటున్నట్లు చెప్పారు. 2030 నాటికి రెండు కోట్ల మంది యువతకు కౌశల్య శిక్షణను ఇవ్వాలని లక్ష్యంగా నిర్ధారించామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రదర్శన విభాగాలను కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వీక్షించారు.